జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 05-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 775 పేజీలు: 4 వెల : రూ.7

# గోకుల కృష్ణ.. గోపాలకృష్ణ..

* జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
* హరేరామ.. హరేకృష్ణ నామసంకీర్తనలతో మార్మోగిన ఆలయాలు



శ్రీకాకుళం, సెప్టెంబర్5 (వార్త):శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ, జగన్నాథ మందిరాల్లో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీకాకుళం, మందస, టెక్కలి, పలాస, సోంపేట, హిరమండలం తదితర మండలాల్లో, ఇస్కాన్ మందిరాల్లో కృష్ణుడి విగ్రహానికి ఊయల సేవ నిర్వహించారు. హిరమండలం మండలంలోని కూర్మ గ్రామంలో భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కీర్తనలు, భజనలు, ప్రవచనాలు, నాటక ప్రదర్శనలు, అన్నదాన కార్యక్రమాలు కూర్మ గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివెరిసింది. హరేకృష్ణ నామసంకీర్తనతో మార్మోగింది.





# కంబిరిగాం అక్రమ లేఅవుట్‌లో.. దందా!

* పంట పొలాల్లోనే ప్లాట్ల విభజన * అనుమతులపై అనుమానాలు * ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ.. సుడా అనుమతులపై సందేహాలు * ఏడు ఎకరాల్లో రహదారుల ఏర్పాటుపై స్థానికుల ఆందోళన



పలాస, సెప్టెంబరు 4 (వార్త): పంట పొలాలు ప్లాట్లుగా మారుతున్నాయి. అనుమతులు లేకుండానే వ్యవసాయ భూముల్లో లే-అవుట్ తరహా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. 'రైతుల ఇళ్ల' పేరుతో భూమిని చిన్నచిన్న బిట్లుగా విభజించి, రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా పలాస మండలం కంబిరిగాం రెవెన్యూ పరిధిలో సుమారు ఏడు ఎకరాల భూమి విభజన వ్యవహారంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూమిని నివాస అవసరాలకు వినియోగించాలంటే వర్తించే నిబంధనల ప్రకారం భూమి వినియోగ మార్పు, లే-అవుట్ తదితర అనుమతులు అవసరం. కంబిరిగాం పరిధిలోని ఈ భూములకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్, పంచాయతీ, సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థ అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు. రైతుల అవసరాల కోసం ఇళ్ల నిర్మాణమా.. లేక భవిష్యత్తులో ప్లాట్ల విక్రయానికి అనుకూలంగా భూమిని అభివృద్ధి చేస్తున్నారా? అనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. భూమి వినియోగ స్వభావం, బిట్ల విభజన, రహదారుల ఏర్పాటు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. అనుమతులు, కన్వర్షన్ ప్రక్రియ లేకుండా వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజిస్తే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి చేసిన స్థలాలను కొనుగోలు చేసే సామాన్యులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంబిరిగాం

భూములపై రెవెన్యూ, పంచాయతీ, సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూ రికార్డులు, కన్వర్షన్ వివరాలు, లే-అవుట్ అనుమతులు, రహదారుల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారుల స్పందనతోనే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడనుంది.



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండల పరిధిలో ఏ ఒక్క పత్రికలోనైనా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతరత్రా సంస్థలపై వ్యతిరేక కథనాలు వస్తే చాలు.. నేను మహా మేనేజ్ చేస్తానంటూ వారి వద్ద వాలిపోతాడు. కథనాలు రాకుండా చూసుకుంటానని, మీడియాను మేనేజ్ చేయాలని చెబుతూ కలెక్షన్ చేస్తుంటాడు. అందినకాడికి దోచేస్తుంటాడు.. అతగాడు ఎవరు? ఎవరెవరి నుంచి ఎంతెంత కలెక్షన్ చేశాడు.. అన్న సమగ్ర కథనం త్వరలో జాతీయ వార్తలో..

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఇచ్ఛాపురంలో పోర్టు నిర్మాణానికి చర్యలు

- 2 వేల ఎకరాలభూముల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఆర్వోబీలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- జిల్లా లో ప్రతి నియోజవర్గాలలో కేవీకే స్టేడియంల నిర్మాణమే లక్ష్యం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. తీర ప్రాంతంలో ఉపభూముల్లో పోర్టు నిర్మాణ ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఇచ్ఛాపురం మునిసిపాల్టీలో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు. రూ.2.29కోట్లతో రాజావారి మైదానంలో నిర్మిస్తున్న బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దెన్కర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తో కలిసి కేంద్ర మంత్రి కిం జరాపు రామ్మోహన్నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్నాయుడు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇక్కడి తీర ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కార్యాచరణ మొదలెట్టినట్టు తెలిపారు. పోర్టు నిర్మాణం ద్వారా పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమలు, సంస్థలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణంలో మరో రైల్వేవంతెన నిర్మాణానికి కూడా సన్నాహాలు మొదలు పెట్టినట్టు ప్రకటించారు. అలైన్మెంట్ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రూపొందించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, దౌర్జన్యం, దాడులతో కొనసాగిందని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ క్రీడా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. గతంలోనూ ఇప్పుడూ చంద్రబాబు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రాజావారి మైదానంలో అన్ని వసతులతో బ్యాడిం టన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో కూడా ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెడతామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రోడ్డు సదుపాయం లేని కంచిలి మండలంలో గిరిజన గ్రామాలకు రహదారులు వేసిన విషయాన్ని ప్రకటించారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీని రైల్వేట్రాక్ రెండుగా విభజించటం వల్ల దశాబ్దాలుగా ఉన్న రాకపోకల సమస్యలు పరిష్కారంగా రెండు ఆర్ ఓబీలుశంకుస్థాపన చేశామన్నారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేష న్ ను అమృత్భారత్ పథకం క్రింద రీమోడల్ చేస్తున్నామని దీంతో పాటు కొత్త రైల్లు హాల్ట్ లు కూడా తీసుకొచ్చామన్నారు. రైల్వేజోన్ మార్పు చారిత్రాత్మకమైన నిర్ణయమని గతంలో పలాసా నుండి ఇచ్ఛాపురం వరకు ఉన్న 7 స్టేషన్లను ఈస్ట్ కోస్ట్ జోన్ ఖుర్దా డివిజన్లో ఉండటం వల్ల చిన్న పనికికూడా భువనేశ్వర్ వెళ్లాల్సి వచ్చిందని కూటమి ప్రభుత్వం కృషితో విశాఖపట్నం జోన్ మంజూరై 7 స్టేషన్లు విశాఖ డివిజన్లో కలిపారన్నారు. ఇకపై రైల్వే సమస్యలు పై నేరుగా డీఆర్ఎంకు కలిసే అవకాశం దొరికిందన్నారు. ఏళ్ల తరబడి రోడ్లు లేని ఇంటీరియల్ గ్రామాలకు కూడా రూ6లక్షలతో బీటీ రోడ్డు, రూ45 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. గత 5 ఏళు ్గా నిలిచిపోయిన ఇచ్ఛాపురం కేవీకే రూ2.40కోట్లుతో శంకుస్థాపన చేశామని అన్నారు.ఇందులో 3కోర్డులు బ్యాడ్మింటన్, జిమ్, అథ్లెటిక్ ట్రాక్, ఆకింగ్ ట్రాక్ ఉంటాయని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా క్రీడలకు పెద్దపేట వేసేవారని స్టేడియంలు నిర్మించి క్రీడాకారులను తయారు చేసి ఒలింపిక్ స్థాయిలో మెడల్స్ సాదించేలా బాటవేసారన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీ లోని 7 నియోజకవర్గాలలోనూ కేవీకేలు మంచి ఇన్ఫ్రాస్టెక్చర్తో స్టేడియంలు నిర్మించటమే నా విజన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం పి రామారావు, సీనియర్ డీసీఎం పవన్ కుమార్, డీఈఓ రాజు, ఎల్ఎడబ్ల్యూ ముళి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జనసేన నాయకులు దాసరి రాజు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ జడ్ఆరయూసీసీ మెంబర్ శ్రీన వాస్ రౌలో, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ. ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య. ఎన్ కోటి, కాళ్ల దర్మారావు,కాళ్ల దిలీప్, లోపింటి పద్మనాభం ఆసి లీలా రాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో జ్ఞానం, నైతిక విలువలను పెంపొందించిన
# ఉపాధ్యాయుల సేవలు మరవలేనివి



**పలాస, సెప్టెంబరు 4 (వార్త):** విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు నైతిక విలువలను పెంపొందించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో గురువుకు అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని తెలిపారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. మారుతున్న విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. విద్యారంగ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికి తమ ప్రభుత్వం హయాంలో పలు చర్యలు చేపట్టినట్లు గుర్తుచేశారు. పలాస నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఉపాధ్యాయుడికి మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




# కాంగ్రెస్ నిరసన ర్యాలీ

- కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ శ్రీకాకుళంలో భారీ ప్రదర్శన
- ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపణ
- బీజేపీ చర్యలకు భయపడేది లేదు
- డీసీసీ అధ్యక్షుడు అన్నాజీరావు

**శ్రీకాకుళం, సెప్టెంబరు 4 (వార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపై, ఆయా పార్టీల నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి పసగాడ సూర్యనారాయణ మిల్లు జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాజీ రావు మాట్లాడుతూ ఇటీవల ఉత్తరాఖండ్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ జరిగిన ప్రాంగణాన్ని కొందరు బీజేపీ కార్యకర్తలు శుద్ధి చేయడాన్ని ప్రస్తావించారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కోరినట్లు తెలిపారు. అయితే దీనికి విరుద్ధంగా రాహుల్ గాంధీపైనే కేసు నమోదు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతును అణిచివేసేందుకు కేసులను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గానీ, తమ నాయకుడు రాహుల్ గాంధీ గానీ బీజేపీ తప్పుడు కేసులకు, బెదిరింపులకు భయపడబోరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రతిపక్షాల హక్కుల కోసం అవసరమైతే మరింత ఉద్ధృతంగా ఉద్యమాలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని అన్నారు. నిరసన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలపై జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న రాజకీయ వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దేశెల్ల గోవింద మల్లిబాబు, ఈస్ట్కోస్ట్ రైల్వే మాజీ సలహా మండలి సభ్యుడు మంత్రి నరసింహమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్లి సురేష్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బస్వా షణ్ముఖరావు, డీసీసీ కార్యదర్శి లఖినేని నారాయణరావు, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు ఇజ్జురోతు రమణ, నియోజకవర్గ కోఆర్డినేటర్ మామిడి సత్యనారాయణ, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాన్ భాష, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి దాలయ్య, తంగుడు రమణయ్య, తాండూర్ గణపతి, గుంట బారిక అప్పారావుతో పాటు నేతలు ఆదినారాయణ, సోడవరం చంద్రశేఖర్, వేదాంతం తిరుమలరావు, లింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




**సోంపేట, సెప్టెంబరు 4 (వార్త):** సోంపేటలోని రవీంద్ర భారతి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టి కన్నయ్యలు,చిన్నారి గోపికలు వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ఆవరణ అంతటా బృందావనాన్ని మైమరిపించేలా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా రాధాకృష్ణుల ప్రతిమలకు ఉయ్యాలలూపి వేడుకను ప్రారంభించారు. పాఠశాలలో ఉట్టిమహోత్సవంలో భాగంగా ఉట్టిని కొట్టేందుకు పాఠశాల చిన్నారులు ఎంతో పోటీపడ్డారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పిందని ,కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఈ కృష్ణాష్టమి అని ,దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేసిన కృష్ణభగవానుడు మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన అని తెలియజేస్తూ రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యం.యెస్.మణి కృష్ణాష్టమి శుభాకాంక్షలను తెలియజేసారు.భాగవతం మన సంస్కృతి సాంప్రదాయాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ వేడుకలు అద్దం పడతాయని తెలుపుతూ, చిన్నారులకు చిలిపికృష్ణుడుగా,తల్లుల కు బాలకృష్ణుడుగా,పెద్దలకు గీతాకారునిగా శ్రీకృష్ణుడు మనందరికీ ధర్మ సందేశాన్ని అందించారని ఉత్తరాంధ్ర రవీంద్రభారతి పాఠశాలల ఇన్ఛార్జ్ ఎన్.వెంకటేష్ తెలిపారు. ద్వాపరయుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తాయి అని పాఠశాల ప్రిన్సిపాల్ పి.కృష్ణారావు అన్నారు.

# ఘనంగా ఇప్పిలి జన్మదిన వేడుకలు

**కంచిలి, సెప్టెంబరు 4 (వార్త):** మాజీ ఎంపీపీ, సీనియర్ వైసీపీ నేత ఇప్పిలి కృష్ణారావు జన్మదిన వేడుకలు కంచిలి మండలంలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి.

ఈ మండలం జక్కర గ్రామం వద్ద కృష్ణా రావు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన సమక్షంలోనే కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇప్పిలిని కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనేక మంది దుస్సాలువలు కప్పి సత్కరించారు. ఆయురారోగ్యాలతో ఉన్నతమైన పదవులతో ప్రజా సేవకు పునారంకితం కావాలని ఆకాంక్షించారు. కంచిలి శ్రీ రాధా కృష్ణ ఆలయం వద్ద ఎమ్మెల్సీ నర్తు రామారావు ఇప్పిలి కృష్ణారావుకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

దశాబ్దాలు క్రితం కాంగ్రెస్ పార్టీలో మొదలైన రాజకీయ ప్రస్థానం ప్రస్తుత వైసిపి వరకు నిరంతరం కొనసాగుతూ నియోజకవర్గంలో ప్రజా సేవకు నిబద్ధతగా అంకితమైన నాయకుడని కృష్ణారావును కొనియాడారు.



# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆధ్యాత్మిక సందడి

- శ్రీ సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు
- శ్రీ సత్యసాయి విద్యావిహార్లో వేణువు ఆకృతిలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన

**పలాస, సెప్టెంబరు 4 (వార్త):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పలాస--కాశీబుగ్గ ప్రాంతంలో ఉన్న రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్య విహార్ లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మహిళల కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

### ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు చేసిన జానపద నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కన్యానగరాజుతో పాటు పలువురు భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

### వేణువు ఆకృతిలో విద్యార్థుల విన్యాసం

రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్లోనూ జన్మాష్టమి వేడుకలు వినూత్నంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడి ప్రధాన ఆభరణంగా భావించే వేణువు (ఫ్లూట్) ఆకృతిలో సమష్టిగా కూర్చొని ప్రదర్శన ఇచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు క్రమబద్ధంగా ఒకే ఆకృతిలో కూర్చోవడం చూపరులను ఆకట్టుకుంది. పీఈటీలు కిరణ్, సింహాచలం, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ పర్యవేక్షణలో ఈ ప్రదర్శనను రూపొందించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు సమష్టి భావన, క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనను ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు. సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభతో పాటు సమన్వయం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. వేడుకలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**- కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్**

**- వినతులపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలకు ఆదేశాలు**

**- సీఎంఆర్ఎఫ్ ద్వారా**

**రూ.16 లక్షల చెక్కుల పంపిణీ**




**పోలాకి, సెప్టెంబరు 4 (వార్త):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామస్థాయి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పింఛన్లు, రెవెన్యూ సమస్యలు, విద్యుత్ సరఫరా, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, వ్యవసాయానికి సంబంధించిన అంశాలతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల నుంచి అందిన వినతులపై ఎమ్మెల్యే రమణమూర్తి అక్కడికక్కడే స్పందించారు. ప్రజా దర్బార్ ప్రాంగణం నుంచే సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల వివరాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. న్యాయమైన, చట్టబద్ధమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రజా దర్బార్ల ద్వారా నేరుగా వినతులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం మంజూరైన నరసన్నపేట పట్టణానికి చెందిన బాధితులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.16 లక్షల విలువైన సహాయాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనారోగ్యం, అత్యవసర వైద్య చికిత్సల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న తోడ్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం మంజూరు కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ పార్టీ క్యాడర్‌తో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ద

## ఆనంద్ నేత్రాలు సజీవం

**పలాస, సెప్టెంబరు 4 (వార్త):** మానవత్వంతో చేసిన నేత్రదానం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపనుంది. పలాసకు చెందిన సానా ఆనంద్ మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చారు. కుమారుల సహకారంతో పలాస శ్రీ సత్యసాయి సేవా సమితి సిహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేత్రదాన ప్రక్రియను నిర్వహించారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్ సహకారంతో నేత్రదాన టెక్నీషియన్ సుజాత నేతృత్వంలో కార్నియాలను సేకరించారు. అనంతరం వాటిని ఎల్.వీ. ప్రసాద్ నేత్ర వైద్యశాలకు తరలించారు. మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపేలా నేత్రదానానికి సహకరించిన ఆనంద్ కుటుంబ సభ్యులను శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సానా ఆనంద్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేత్రదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేత్రాలను దానం చేయడం ద్వారా చూపులేని వారికి వెలుగును అందించవచ్చని అన్నారు.



### కూచిపూడి. డిప్లమా సర్టిఫికెట్ కోర్సుల్లో ..

# ఇచ్ఛాపురం విద్యార్థుల ప్రతిభ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4 (వార్త):** మహారాజా గవర్నమెంట్ మ్యూజిక్ కాలేజ్ విజయనగరంలో జరిగిని సర్టిఫికెట్ కోర్స్ డిప్లమా కోర్సులలో ఇచ్ఛాపురం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు ఫస్ట్ క్లాస్ సెకండ్ క్లాస్ లలో చక్కని ఉత్తీర్ణతను సాధించారు. డిప్లమో కోర్సులో చాట్ల జయలక్ష్మి, సర్టిఫికెట్ కోర్సుల్లో బి.లిఖిత, పి.జైత్రికాత్యాయనీ, డి.సింధు, ఎ. దీపిక ఈ కోర్సులలో పాల్గొని చక్కని రిజల్ట్‌ను సాధించారు. నాట్య గురువులు ఏలేశ్వరపు శ్రీనివాసులు కూచిపూడి గ్రామం విజయవాడ జిల్లా వాస్తవ్యులు ఈ చిన్నారులందరికీ చక్కని తర్ఫీదును ఇచ్చి మంచి విజయాన్ని అందించారు. అకాడమీ నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్. దట్టికావ్యలు చిన్నారులకు చక్కని సూచనలు ఇచ్చి ప్రోత్సహించారు. అకాడమీ అధ్యక్షులు చిన్నా గురు స్వామి జయలక్ష్మి పట్నాయక్ దంపతులు డాన్స్ టీచర్స్ చిన్నారుల తల్లిదండ్రులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## మహాలక్ష్మి దేవికి శ్రావణ శుక్రవార విశేష పూజలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4 (వార్త):** జగన్నాథ స్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి దేవికి శ్రావణ శుక్రవార విశేష పూజలు నిర్వహించారు. ఉషోదయాన నిత్యారాధన అనంతరం.. లక్ష్మి దేవి మూల విరాట్ కు పాలు, పంచామృతాలు, గంగా జలం, ఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్ర అలంకరణ అనంతరం సంపెంగ, మాలతి, చామంతి, కలువ, ముద్ద మందార, రేఖామందార, వాడంబరం, నందివర్ధనం, జాజి తదితర 9 రకాల పుష్పాలు , పసుపు, కుంకుమల తో సహస్రనామ అర్చన ను అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు, లక్ష్మీ, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. హారతి , మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగాయి.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**- మేదా కాన్సెప్ట్‌లో చిన్నారుల సందడి..**

**- కృష్ణ, గోపికల వేషధారణతో ఆకట్టుకున్న విద్యార్థులు**

**పలాస, సెప్టెంబరు 4 (వార్త):** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మేదా కాన్సెప్ట్ పాఠశాలలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణలు, కిరీటాలు, ఆభరణాలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మ విశిష్టత, ధర్మం, నీతి, భక్తి, సత్యం వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు చిన్ని కృష్ణులు, గోపికలుగా ముస్తాబై కృష్ణలీలలను ప్రతిబింబించేలా కార్యక్రమాల్లో పాల్గొనడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. సంప్రదాయ పండుగల ద్వారా చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించవచ్చని ఉపాధ్యాయ బృందం తెలిపారు. పాఠశాలల్లో జన్మాష్టమి సందర్భంగా కృష్ణ, గోపికల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కార్యక్రమానికి హాజరై చిన్నారుల వేషధారణలను ఆసక్తిగా తిలకించారు.

**సంప్రదాయాల పరిచయం..**

**విలువల బోధన**

పాఠ్యాంశాలతో పాటు భారతీయ పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి. సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు రాము, రమేష్తో పాటు ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన జానపద సంబరాలు



**కవిటి, సెప్టెంబరు 4 (వార్త):** కవిటి మండలం ఆర్. బెలగాం గ్రామంలో శ్రీమహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో జానపద ఆధ్యాత్మిక గురువుగారు సద్గురు శ్రీ జీరు పాపయ్య 36వ వర్ధంతి కార్యక్రమం మూడు రోజుల కార్యక్రమం మొదటి రోజు శుక్రవారం రాజయోగి పరంపర గురుభక్తి కార్యక్రమంలో ఉదయం స్వర్గీయ జీరు పాపాయ్య రెడ్డి చిత్రపటం, అలాగే స్వర్గీయ జీరు ధర్మారావు, వెంకటరావు చిత్రపటాలను బాజీ భజంత్రీలు, మేళ తాళాలు, శ్రీ కాశీ విశ్వనాథ, పోలమ్మ తల్లి, శ్రీ రాధాకృష్ణ జానపద కోలాట బృందాలచే భక్తులు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.

అనంతరం వేదికపై గురుపరంపర భక్తులచే పూజల నిర్వహించి నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు గ్రామ ప్రజలకు సన్మాన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ సభ్యులు కళాకారులు, గ్రామ పెద్దలు, నవోదయ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

**- విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని యూటీఎఫ్ ఆవేదన**

**- నేటి నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు**

**- ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపు**



**నరసన్నపేట, సెప్టెంబరు 4 (వార్త):** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లండ బాబురావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. నరసన్నపేటలో గురువారం సాయంత్రం వారు మాట్లాడుతూ ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విద్యాశాఖ అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే విధుల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఈ అంశంపై పలుమార్లు ప్రభుత్వం, విద్యాశాఖ అధికా రుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తగిన స్పందన రాక పోవడంతో ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్ప డిందన్నారు. ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నేటి నుంచి విజయ వాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని, దీక్షలను విజయ వంతం చేయాలని సంఘం సభ్యులకు పిలుపుని చ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## జలుమూరు పశువైద్య కేంద్రానికి శాశ్వత వైద్యాధికారి ఎప్పుడో?

**- కొంతకాలంగా రెగ్యులర్ డాక్టర్ లేక మూగజీవాలకు తప్పని తిప్పలు**

**- వారానికి మూడు రోజులు మాత్రమే ఇన్‌చార్జి వైద్య సేవలు**

**- శాశ్వత వైద్యాధికారిని నియమించాలని రైతుల డిమాండ్**

**జలుమూరు, సెప్టెంబరు 4 (వార్త):** జలుమూరులోని పశువైద్య కేంద్రంలో శాశ్వత పశు వైద్యాధికారి లేకపోవడంతో రైతులు, పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన పశుపోషకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పశువైద్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు అనారోగ్యానికి గురైన సమయంలో సకాలంలో వైద్య సేవలు అందక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో పశువులకు చికిత్స అందించేందుకు వైద్యాధికారి అందుబాటులో లేకపోవడం సమస్యగా మారిందని పేర్కొన్నారు. పాడి పశువులు, ఇతర మూగజీవాల ఆరోగ్య సంరక్షణ కోసం మండల కేంద్రంలోని ఈ ఆసుపత్రిపై అనేక గ్రామాల రైతులు ఆధారపడుతున్నారు. వాస్తవానికి మరో పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఒక వైద్యాధికారి వారానికి మూడు రోజులు జలుమూరు పశువైద్య కేంద్రంలో ఇన్‌చార్జిగా సేవలందిస్తున్నారు. అయితే మిగిలిన రోజుల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు ప్రత్యామ్నాయ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ ఆసుపత్రికి ప్రత్యేకంగా నియమితులైన శాశ్వత వైద్యాధికారి లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారుతోందని రైతులు అంటున్నారు. మారుమూల గ్రామాల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలుమూరు పశువైద్య కేంద్రానికి వెంటనే శాశ్వత పశువైద్యాధికారిని నియమించాలని వారు కోరుతున్నారు. నెలల తరబడి ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంపై రైతులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశుసంపద రైతుల జీవనాధారంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో జలుమూరు పశువైద్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, శాశ్వత వైద్యాధికారిని నియమించి మూగజీవాలకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఇచ్ఛాపురాన్ని అగ్రస్థానంలో నిలుపుతా

**- కంచిలిలో అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు**

**కంచిలి, సెప్టెంబరు 4 (వార్త):** కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వాల అధికారంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి చేపట్టి జిల్లాలోనే నెంబర్ వన్‌గా నిలుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌తో కలిసి కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, నూతన కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేపట్టారు. కంచిలి మండలం పోలేరు పంచాయతీ పరిధిలో 1.31 కోట్లతో రెండు బీటీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి ఇది సరైన అవకాశం అని అన్నారు. ఇచ్ఛాపురం కవిటీ, కంచిలి, సోంపేట మండలాల్లో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే ప్రతిపాదనలు ఉన్నాయని అన్నారు. త్వరలో ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. ఒరిస్సా సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన కలలు సహకారం అయ్యే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోనూ ఎన్నడూ జరగని విధంగా చక్కనైన అభివృద్ధికి మంచి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలో మౌలిక వసతులను మరింత విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ , జనసేన ఇన్చార్జ్ దాసరి రాజు, జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురపు తేజేశ్వరరావు,కంచిలి టిడిపి అధ్యక్షులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య తదితరులు పాల్గొన్నారు.



**వైసీపీ నుంచి టిడిపిలోకి....**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటన సందర్భంగా గుండం గ్రామంలో సుమారు 40 కుటుంబాలు వైసీపీ నుంచి టిడిపిలోకి చేరాయి. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## జిల్లాకు గర్వకారణంగా నలుగురు గురువులు

**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు**

**జలుమూరు మండల ఉపాధ్యాయుల ఎంపిక**









**జలుమూరు, సెప్టెంబరు 4 (వార్త):** విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి అంకితభావంతో కృషి చేస్తున్న జలుమూరు మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం మండలానికి గర్వకారణంగా నిలిచింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో వీరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోనున్నారు. శ్రీముఖలింగం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా విధులు నిర్వహిస్తున్న మీనకేతన్ దాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిసింది. అవార్డుకు ఎంపికైన సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు. టెక్కలిపాడు పంచాయతీ గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గుండ మాధవి సైతం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో రెండోసారి ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆమె నిరంతరం చేస్తున్న కృషిని గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పలువురు విద్యార్థులు, గ్రామస్థులు ఆమెను అభినందిస్తూ విద్యారంగానికి అందిస్తున్న సేవలను ప్రశంసించారు. రావిపాడు జడ్పీ పాఠశాలలో గణిత స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పల్లి రమేష్కు కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కింది. జిల్లా కేంద్రం నుంచి అవార్డు ఎంపికకు సంబంధించిన సమాచారం అందడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గణిత బోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న రమేష్ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తోటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా రావిపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్ కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాధవరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు శేఖర్‌ను అభినందించారు. నరసన్నపేట సిటిజన్ ఫోరం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, సిటిజన్ సొసైటీ వెల్ఫేర్ సభ్యులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం జలుమూరు మండల విద్యారంగానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాలల అభివృద్ధి కోసం వీరు చేస్తున్న కృషికి ఈ పురస్కారాలు నిదర్శనమని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

**- ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్వాహకులు అనుమతులు పొందాలని సూచన**

**- మండపాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి**

**- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని సీఐ పిలుపు**

**నరసన్నపేట, సెప్టెంబరు 4 (వార్త):** ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి అనుమతులు పొందాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు నిబంధనలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. శుక్రవారం నరసన్నపేటలో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసేందుకు ఏపీ డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ముందస్తుగా అనుమతులు పొందాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మండపాల వద్ద భద్రతా చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఐ తెలిపారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను పాటిస్తూ ప్రజలందరూ సహకరిస్తే ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించవచ్చని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.





## తిమడాంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**- శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజలు**

**- గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఏకాహం భజన కార్యక్రమాలు**

**- పలు భజన బృందాలతో భక్తిమయమైన ఆలయ ప్రాంగణం**

**జలుమూరు, సెప్టెంబరు 4 (వార్త):** తిమడాం గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారగా, భక్తి గీతాలు, నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏకాహం భజన కార్యక్రమాలను ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు

ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తున్నాయి. భజనలతో ఆలయ పరిసరాలు మారుమోగుతున్నాయి. శనివారం ఉదయం వరకు ఏకాహం భజన కార్యక్రమాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందుతున్నారు.

## ఉపాధి కూలీలకు శక్తి యాప్‌పై అవగాహన

**- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**

**- అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని విజ్ఞప్తి**

**- మొక్కలు నాటిన శక్తి బృందం**

**పోలాకి, సెప్టెంబరు 4 (వార్త):** పోలాకి మండలం దండులక్ష్మీపురంలో ఉపాధి హామీ పథకం పనులకు వచ్చిన వేతనదారులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శక్తి బృందం సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజన్-4 శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ మాట్లాడుతూ, ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు, ఇతర గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ తెలియజేయరాదని అవగాహన కల్పించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని, ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉపాధి పనుల ప్రదేశంలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపునకు ప్రజలు సహకరించాలని బృందం సభ్యులు సూచించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు నరసింహమూర్తి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.




## పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

**- సిబ్బందితో మేజర్ పంచాయతీ ఈఓ జగన్మోహనరావు సమావేశం**

**- ఉదయం, మధ్యాహ్నం తప్పనిసరిగా మస్టర్ వేయాలని ఆదేశం**

**- పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు**



**నరసన్నపేట, సెప్టెంబరు 4 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని మేజర్ పంచాయతీ ఈఓ పిల్లా జగన్మోహనరావు సూచించారు. పారిశుధ్య నిర్వహణ సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం పారిశుధ్య నిర్వహణ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో మస్టర్ వేయాలని ఆదేశించారు. విధులకు గైర్హాజరు కావడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి అంశాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించినట్లు తెలిసింది. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పట్టణంలోని అన్ని వీధులను సిబ్బంది క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఈఓ జగన్మోహనరావు సూచించారు.

## శాంతియుతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

**- మండపాల నిర్వాహకులతో సీఐ శ్రీనివాసరావు సమావేశం**

**- నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచన**

**- అభయం కార్యక్రమం, మహిళా భద్రతపై అవగాహన**

**నరసన్నపేట, సెప్టెంబరు 4 (వార్త):** వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, పోలీసు శాఖ సూచించిన నిబంధనలను పాటిస్తూ నిర్వహించుకోవాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మండపాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఉర్లాం, నడగాం, సత్యవరం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల నిర్వాహకులతో సీఐ శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటుకు సంబంధించిన పలు అంశాలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పండుగ వేడుకల సమయంలో గ్రామాల్లో సోదరభావం, సామరస్య వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీసు శాఖతో మండపాల నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరిస్తే ఉత్సవాలు సజావుగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అనంతరం పోలీసు శాఖ చేపడుతున్న అభయం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళల భద్రత కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న భద్రతా చర్యల గురించి వివరించారు. అత్యవసర సమయాల్లో మహిళలు పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గణేష్, పోలీసు సిబ్బంది, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546